ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



శ్రీకాకుళం
జిల్లా వార్తలు
బుధవారం 10 జూలై 2024

డిగ్రీ ఇన్‌స్టెంట్ పరీక్షకు 248 మంది హాజరు

ఎచ్చెర్ల, జూలై 9: అంబేద్కర్ యూనివర్సిటీలో మంగళవారం డిగ్రీ ఇన్‌స్టెంట్ పరీక్ష నిర్వహించారు. అనుబంధ కళాశాలల్లో చదివి ఐదో సెమిస్టర్‌లో ఓ సబ్జెక్ట్ తప్పిన విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహించగా.. 248మంది హాజరయ్యారు. వారం రోజుల్లో ఫలితాలను వెల్లడిస్తామని డీన్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు.

గురుకులంలో మిగులు సీట్ల భర్తీ

గుజరాతీపేట: పెద్దపాడులోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలోని ఐదో తరగతిలో మిగులు సీట్లను ఈ నెల 11న లాటరీ ద్వారా భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.జ్యోతి తెలిపారు. ఎస్సీ 12, ఎస్టీ ఒక సీటు ఉన్నాయన్నారు.

ఇప్పుడైనా మేల్కొంటారా?

- కనీస తనిఖీలు చేపట్టని డీఎస్‌వో
- రేషన్ వాహనాల్లో బిల్లులు కూడా ఇవ్వని వైనం
- తూనికల్లో తేడా వచ్చినా కానరాని చర్యలు
- చౌక బియ్యం అక్రమంగా తరలింపు
- విజిలెన్స్ తనిఖీల్లో పట్టుబడినా.. పైపైనే కేసులు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

ఆ శాఖ వైసీపీ పాలనలో మొక్కుబడిగా విధులు నిర్వహించింది. నిత్యావసరాలు ప్రజలకు అందుతున్నాయా? లేదా? అన్న విషయాన్ని కూడా ఆ శాఖ అధికారులు మరిచిపోయారు. ప్రభుత్వం మారినా.. ఇప్పటికీ నిద్రావస్థను వీడడం లేదు. ఇదీ ప్రజా పంపిణీ వ్యవస్థలో అధికారుల తీరు. గత వైసీపీ ప్రభుత్వం.. 'ఇంటి వద్దకే రేషన్' అంటూ వాహనాల ద్వారా లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు అందజేసేలా నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. అంతకుముందు రేషన్ డిపోల్లో సక్రమంగా సరుకులు అందేవి. కాగా ఈ వాహనాల ద్వారా మాత్రం ఎప్పుడు రేషన్ సరుకులు అందుతాయో తెలియని దుస్థితి నెలకొంది. వీధి చివరనో.. రోడ్డు చివరనో.. సరుకులు పంపిణీ చేయగా లబ్ధిదారులు ఇబ్బందులు పడేవారు. కొంతమందికే కందిపప్పు, పంచదారను పంపిణీ చేసేవారు. అలాగే రేషన్ సరుకులు ఇచ్చినప్పుడు సంబంధిత రశీదులను లబ్ధిదారులకు వాహన సిబ్బంది ఇవ్వడం లేదు. రశీదు కోసం ప్రశ్నిస్తే.. తమకు డివైజ్‌లో నింపే పేపర్ సరఫరా కావడం లేదని.. పొంతనలేని సమాధానం ఇస్తున్నారు. కాగా రేషన్ వాహనాల్లో.. సరుకుల పంపిణీ తీరును అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని జిల్లావాసులు ఆరోపిస్తున్నారు. తూనికల్లో తేడాలున్నా చర్యలు తీసుకోవడం లేదని పేర్కొంటున్నారు. ఇన్‌చార్జి డీఎస్‌వో పర్యవేక్షణ కరువైందని విమర్శిస్తున్నారు. ఆ అధికారి అటు ఐసీడీఎస్‌లోనూ పూర్తిస్థాయిలో పర్యవేక్షణ లేదని ఆరోపిస్తున్నారు. కనీసం వారానికి ఓ మండలంలో తనిఖీలు చేసినా అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని పేర్కొంటున్నారు. ఈ దిశగా అధికారులు పనిచేసేలా.. జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



శ్రీకాకుళంలో రేషన్ బియ్యం పంపిణీ (ఫైల్)

రేషన్ బియ్యం పక్కదారి..

జిల్లాలో ఈ ఐదేళ్లూ రేషన్ బియ్యం యథేచ్ఛగా పక్కదారి పట్టాయి. విజిలెన్స్ అధికారులు పలుమార్లు పట్టుకున్నా.. కేసులు నమోదు చేసి వదిలేశారు. ఇందుకు కారణం.. తెర వెనుక అన్ని విభాగాల అధికారులు.. పట్టుబడిన వ్యక్తిని తప్పించేందుకు సహకారం అందించడమే. ఎల్.ఎన్.పేట, హిరమండలం, కోటబొమ్మాళి, శ్రీకాకుళం రూరల్, పొందూరు, పాతపట్నం, పోలాకి, నరసన్నపేట, ఇచ్ఛాపురం, పలాస ప్రాంతాల నుంచి గతంలో చాలాసార్లు భారీస్థాయిలో చౌక బియ్యం ఇతర జిల్లాలకు తరలిస్తుండగా పట్టుబడ్డాయి. పత్రికలకు ప్రకటనలు ఇచ్చేయడం.. ఆ తర్వాత అదే అధికారులు.. కేసులు నీరుగార్చేలా 'మమ' అనిపించేస్తున్నారు. కొంతమంది వ్యాపారులు.. రేషన్ బియ్యాన్ని లబ్ధిదారుల వద్ద కిలో రూ.12చొప్పున కొనుగోలు చేస్తున్నారు. వాటిని స్థానిక మిల్లర్లకు విక్రయించి.. రీసైక్లింగ్ చేస్తున్నారు. సన్నబియ్యం పేరిట పలు బ్రాండ్ల పేరుతో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. జిల్లాలోని స్కాట్‌పేట నుంచి ఆర్టీసీ కార్గో బస్సులోనే కాకినాడ పోర్టుకు తరలిస్తుండగా.. అధికారిక సమాచారంతో అప్పట్లో పట్టుకున్నారు. రెండు రోజులు అధికారులు హడావుడి చేసి.. తర్వాత.. ఆ కేసును విడిచిపెట్టేశారు. ఇప్పటికీ రేషన్ బియ్యం పక్కదారి పడుతూనే ఉన్నాయి. కొన్ని రీసైక్లింగ్ జరగగా.. మరికొన్ని ప్రత్యేక వాహనాల్లో పోర్టుకు తరలిపోతున్నాయి. కొత్తగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్.. ఇటువంటి అక్రమాలకు అడ్డుకట్ట వేసేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. రేషన్ బియ్యం విక్రయాలు, నిత్యావసరాలు బ్లాక్‌మార్కెట్‌కు తరలింపుపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు కూడా ప్రత్యేక నిఘా పెట్టాలని జిల్లావాసులు కోరుతున్నారు.

బూట్లు.. పాట్లు

- విద్యార్థులకు చాలని కొలతలు
- కుస్తీలు పడుతున్న ఉపాధ్యాయులు, ఎంఈవోలు
- తలనొప్పిగా మారిన పంపిణీ

(నరసన్నపేట)

విద్యాకానుకలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బూట్లు పంపిణీ ప్రక్రియ ఉపాధ్యాయులకు, ఎంఈవోలకు ప్రహసనంగా మారింది. వేసవి సెలవులకు ముందు విద్యార్థుల పాదం సైజు ప్రకారం బూట్లుకు విద్యాశాఖ అధికారులు ఇండెంట్ పెడతారు. పాఠశాలలు పునఃప్రారంభం తర్వాత కొంతమంది విద్యార్థులు మరో పాఠశాలకు మారడం, ఇంకొంత మంది విద్యార్థుల ఎదుగుదల కారణంగా బూట్ల సైజుల్లో తేడా వస్తోంది. దీంతో బూట్ల పంపిణీ ఉపాధ్యాయులకు తలనొప్పిగా మారుతోంది. జిల్లాలో 2,655 ప్రభుత్వ పాఠశాలల్లో 1,73,743 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికి ప్రభుత్వం విద్యాకానుకలో భాగంగా యూనిఫాం, బూట్లు, సాక్సులు, నోట్‌పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, బెల్టు పంపిణీ చేస్తోంది. గత నెలాఖరున పాఠశాలల్లో ఉపాధ్యాయులు యూనిఫాం, బ్యాగ్‌లు, బూట్లు పంపిణీ చేశారు. కాగా.. కొన్ని మండలాల్లో.. బాలురకు చెందిన బ్యాగ్‌ల ప్యాకింగ్‌లో బాలికల బూట్లు వచ్చేశాయి. అలాగే మరికొన్ని చోట్ల బూట్ల కొలతల్లో తేడాలు ఉండడంతో అవి విద్యార్థులకు సరిపోవడం లేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు వాటిని తిరిగి ఉపాధ్యాయులకు ఇచ్చేస్తున్నారు. చాలా చోట్ల ఇదే సమస్య ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు.. మండల స్థాయిలో స్టాక్‌పాయింట్ కేంద్రాల వద్ద బూట్లు ఎక్స్ఛేంజ్ నిర్వహిస్తున్నారు. ప్రధానంగా ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు సరిపడా సైజులు లభించక.. ఉపాధ్యాయులు పాఠశాల నుండి రోజూ స్టాక్ కేంద్రాల వద్దకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏటా బూట్లు పంపిణీకి దాదాపు పదిహేను రోజులు శ్రమించాల్సి వస్తోందని ఎమ్మార్సీ సిబ్బంది పేర్కొంటున్నారు. కొంతమందికి సైజు చాలక.. మరికొంతమంది విద్యార్థులకు లూజుగా ఉండటంతో బూట్లు తీసుకుంటున్నా.. వాటిని ధరించకుండా మూలపడేస్తున్నారు. ఈ ఏడాదైనా విద్యార్థులకు సరిపడే సైజులు వస్తాయని అందరూభావించారు. కాగా... గత ప్రభుత్వ హయాంలో వీటిని ఇండెంట్ ఇచ్చారని, నాణ్యత, సైజు విషయాల్లో ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. తమిళనాడు తరహాలో విద్యార్థుల బూట్లకు సంబంధించిన డబ్బులు.. వారి తల్లిదండ్రులకు డబ్బులు అందిస్తే.. ఈ తలనొప్పి ఉండదని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.



పాఠశాలల నుంచి నరసన్నపేట మండల కేంద్రానికి బూట్లు తీసుకువచ్చిన ప్రధానోపాధ్యాయులు

ఇబ్బందులు లేకుండా..

పాఠశాలలకు పంపిణీ చేసే బూట్ల కొలతల్లో తేడాలు ఉంటే మండల స్టాక్ కేంద్రాలకు వెనక్కి తెప్పించాలని ఎంఈవోలకు ఆదేశించాం. వాటిని సైజులు వారీగా వేరు చేసి మళ్లీ పాఠశాలలకు పంపిణీ చేయాలని సూచించారు. ఇంకా సైజుల్లో తేడా ఉంటే ఉన్నతాధికారులు దృష్టికి ఈ సమస్య తీసుకువెళ్లతాం. ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతాం.

-డీఈవో వెంకటేశ్వరరావు

నాగావళి అభివృద్ధికి ప్రణాళికలు

- రెండు విడతలుగా సుందరీకరణ పనులు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కలెక్టరేట్, జూలై 9: నాగావళి నది అభివృద్ధికి, సుందరీకరణకు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కార్పొరేషన్ కమిషనర్ ఓబులేసు, ఇతర అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'నాగావళి నదీ పరీవాహక ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేలా ప్రాజెక్టులను గుర్తించాలి. నిపుణులు, సలహా కమిటీల ఏర్పాటుపై నిర్దిష్ట ఉత్తర్వులతో రావాలి. రెండు విడతల్లో సుందరీకరణ పనులు చేపట్టాలి. తొలి విడతలో కోడిరామ్మూర్తి స్టేడియం వెనుక నుంచి కొత్తబ్రిడ్జి వరకు నాగావళి నదికి ఒకవైపు రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు పేరుతో ఆహ్లాదకరమైన ఘాట్లు ఏర్పాటు చేయాలి. కనీసం 15-20 అడుగుల వెడల్పు గల నడక మార్గాన్ని అభివృద్ధి చేయాలి. సీటింగ్ బెంచీలు, గ్రీన్ కవర్ వంటి సౌకర్యాలు, విశాలమైన పార్కింగ్, అద్భుతమైన లైటింగ్ ఏర్పాటు చేసేలా ప్రణాళిను రూపొందించాలి. మలి విడతలో పొన్నాడ బ్రిడ్జి నుంచి డే అండ్ నైట్ వద్ద స్వర్గధామం వరకు పర్యాటకంగా అభివృద్ధి చేయాల'ని ఆదేశించారు. సమావేశంలో నీటిపారుదల శాఖ ఎస్ఈ సుధాకర్, పబ్లిక్ హెల్త్ ఈఈ పొగిరి సుగుణాకరరావు, మునిసిపల్ ఈఈ గంగాధరరావు, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వైద్యారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వైద్యారోగ్యశాఖపై సమీక్ష నిర్వహించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలోని అన్ని విభాగాల పనితీరు గురించి ఆరా తీశారు. మాతా శిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలు తదితర విషయాలపై ప్రస్తావించారు. కోటబొమ్మాళి, పొన్నాడ, వెన్నెలవలస రెసిడెన్షియల్ పాఠశాలల్లో జ్వరాలు, అతిసార వ్యాధులపై ఆరా తీశారు. మెరుగైన వైద్యసేవలు అందజేయాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యుఎస్ సహకారంతో నీటి నమూనాలు సేకరించి ల్యాబ్ పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 11న ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని.. బ్యానర్‌ను ఆవిష్కరించారు.

సమావేశంలో డీఎంహెచ్‌వో బొడ్డేపల్లి మీనాక్షి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ షకీలా, డీసీహెచ్ఎస్ డా.జీవీ రాజ్యలక్ష్మి, రిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా.సి.రవి వెంకటాచలం, ప్రోగ్రామ్ అధికారులు జీవీ లక్ష్మి, శ్రీదేవి, డా.సుజాత, డా.పి.ప్రకాశరావు, డా.ప్రవీణ్, డిప్యూటీ డెమో వేంకటేశ్వరరావు, శైలజ, రామనాగేశ్వరరావు, మోహిని, సన్యాసిరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సచివాలయ ఉద్యోగిపై..

వైసీపీ నాయకుడి దాడి

- పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు



బాధితుడు షేక్ బుకారి

హరిపురం, జూలై 9: సచివాలయ ఉద్యోగిపై వైసీపీ నాయకుడు దాడికి పాల్పడ్డాడు. కుల ధ్రువీకరణ పత్రం అప్‌లోడ్‌కు సంబంధించి పది నిమిషాలు నిరీక్షించాలని ఉద్యోగి చెప్పగా.. వైసీపీ నేత నానా దుర్భాషలాడి దాడి చేశాడు. దీంతో బాధిత ఉద్యోగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. మందస మండలం లోహరిబంద సచివాలయంలో గ్రామానికి చెందిన అందాల చందు అనే వ్యక్తి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం రెండు రోజులు కిందట దరఖాస్తు చేశారు. వాటిని పరిశీలించాలని సర్పంచ్ కుమారుడు, వైసీపీ నేత రాపాక శేషగిరి మంగళవారం సచివాలయానికి చేరుకొని డిజిటల్ అసిస్టెంట్ షేక్ బుకారిని అడిగాడు. 'ఆదాయ ధ్రువీకరణ పత్రం వచ్చింది. కుల ధ్రువీకరణ పత్రం స్టేజ్‌ను పరిశీలిస్తాను. పది నిమిషాలు కూర్చొండి' అని డిజిటల్ అసిస్టెంట్ చెప్పగా.. సదరు వైసీపీ నేతకు కోపం వచ్చింది. నన్నే కూర్చోమంటావా.. నీ అంతు చూస్తానంటూ.. నానా దుర్భాషలాడి డిజిటల్ అసిస్టెంట్ షేక్ బుకారిపై దాడికి పాల్పడ్డాడు. అడ్డుకున్న ఇతర సచివాలయ ఉద్యోగులతోనూ వాగ్వాదం చేశాడు. దీంతో బాధితుడు షేక్ బుకారి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ కేసు దర్యాప్తు చేస్తున్నామని మందస ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

రేపటి నుంచి పాలిసెట్ తుది కౌన్సెలింగ్

ఎచ్చెర్ల, జూలై 9: పాలిసెట్ తుది కౌన్సెలింగ్ ఈ నెల 11 నుంచి నిర్వహించనున్నట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (శ్రీకాకుళం) ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, సహాయ కేంద్రం కోఆర్డినేటర్ జి.దామోదరరావు తెలిపారు. 'ఈ నెల 11 నుంచి 13వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ ఫీజు చెల్లింపు, సర్టిఫికెట్ల పరిశీలన పూర్తిచేసుకోవాలి. 11 నుంచి 14 వరకు కళాశాలలు, బ్రాంచ్‌ల ఎంపికకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. ఈ నెల 16న సీట్ల కేటాయింపు వివరాలను పాలిసెట్ కన్వీనర్ ప్రకటిస్తారు. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 18 నుంచి 20వ తేదీలోగా సంబంధిత కళాశాలలో రిపోర్ట్ చేయాలి. తొలి విడత కౌన్సెలింగ్‌కు హాజరై సీటు పొందిన విద్యార్థులు బ్రాంచ్, కళాశాల మార్పు కోరుకుంటే అప్పటి లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌తో ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. ఎలాంటి సాంకేతిక సమస్యలు ఎదురైనా హెల్పింగ్ కేంద్రాన్ని సందర్శించాల'ని దామోదరరావు సూచించారు.



సూదికొండ వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో, డీఈవో బృందం

పలాసలో కేంద్రీయ విద్యాలయం

- రెవెన్యూ, విద్యాశాఖాధికారుల స్థల పరిశీలన

పలాస, జూలై 9: పలాసకు కేంద్రీయ విద్యాలయం మంజూరైంది. ఈ మేరకు విద్యాలయం నిర్మాణానికి సంబంధించి ఆర్డీవో భరత్‌నాయక్, డీఈవో కె.వెంకటేశ్వరరావు తదితరులు స్థల పరిశీలన చేశారు. సూదికొండ తూర్పువైపు భాగంలో ఉన్న స్థలాలను పరిశీలించారు. ఇప్పటికే ఆ స్థలాలు నాయకుల కబ్జాల్లో ఉండగా.. మరికొన్ని స్థలాలు ఎక్సైజ్‌శాఖతోపాటు స్వాతంత్రసమరయోధులు, ఇంకొంతమందికి కేటాయించినట్లు అధికారులు గుర్తించారు. ఈ ప్రాంతంలో కంకర తవ్వకాలకు కూడా గతంలో అనుమతులు ఇచ్చి పర్యావరణ ఇబ్బందులు కారణంగా రద్దు చేశారు. ప్రస్తుతం ఆ ప్రాంతం చదునుగా ఉండడంతో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు అనువుగా ఉంటుందో లేదో పరిశీలించారు. విద్యాలయానికి మొత్తం 12 ఎకరాలు అవసరం ఉంటుందని డీఈవో తెలిపారు. అంతమేరకు ఇక్కడ స్థలాలు లేకపోవడంతో ఉన్న వాటిని స్వాధీనం చేసుకోవడమో.. లేదా ఇంకో చోట పరిశీలించేలా చర్యలు చేపట్టనున్నారు. ప్రస్తుతం పలాస ప్రాంతంలో ప్రభుత్వ స్థలాల కోసం అధికారులు జల్లెడ పడుతున్నారు. ఇంగిలిగాం ప్రాంతంలో ప్రభుత్వ స్థలాలు ఎక్కువగా ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. అయితే అక్కడ గతంలో ఇళ్ల స్థలాలు, మరే ఇతర అవసరాలకు పట్టాలు ఇచ్చారా? లేదా? అనేది తేలాల్సి ఉంది. అధికారుల వెంట తహసీల్దార్ నాయుడు, ఎంఈవో శ్రీనివాసరావుతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

లైంగిక వేధింపులు చట్టరీత్యా నేరం

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

గుజరాతీపేట, జూలై 9: మహిళలపై లైంగిక వేధింపులు చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. జిల్లా కోర్టు భవనంలో మంగళవారం కార్మికుల లైంగిక వేధింపుల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలపై లైంగిక వేధింపులను నివారించేందుకు మహిళా చట్టం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. జిల్లాలో ఆస్పత్రి సిబ్బంది, కర్మాగారాలు, షాపింగ్‌మాల్స్ తదితర కార్మికులకు లైంగిక వేధింపులకు సంబంధించిన చట్టాలపై వివరించారు. అలాగే ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ బి.సుదర్శన దొర, ప్రాజెక్టు డైరక్టర్ బి.శాంతిశ్రీ, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ అజయ్ కార్తికేయ, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, ఆర్డీవో జీఎస్ఎల్‌వీ మంగాదేవి, డీసీపీవో కేవీ రమణ, మోటార్ ఇన్‌స్పెక్టర్ వీవీ గంగాధరరావు, ప్రైవేటు కార్యాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

వైన్‌షాపులకు మళ్లీ నిలిచిన మద్యం సరఫరా

ఎచ్చెర్ల, జూలై 9: ఎచ్చెర్లలోని బేవరేజస్ కార్పొరేషన్(బాట్లింగ్) యూనిట్ నుంచి జిల్లాలోని వైన్‌షాపులకు రెండు రోజులుగా మద్యం సరఫరా నిలిచిపోయింది. గత నెల 26 నుంచి ఐదు రోజులపాటు ఇదే సమస్య తలెత్తింది. తాజాగా మళ్లీ సమస్య ఏర్పడింది. గత ప్రభుత్వం బాట్లింగ్ యూనిట్‌ల నుంచి ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు టెండర్ ఇచ్చింది. ఈ ట్రాన్స్‌పోర్ట్ సంస్థ జిల్లాల వారీగా సబ్‌కాంట్రాక్ట్ ఇచ్చి వైన్‌షాపులకు మద్యం సరఫరా చేసింది. గతంలో ఏర్పడిన సమస్యతో ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్ బేవరేజస్ కార్పొరేషన్ అధికారులు చర్చించడంతో కొంతమేర బకాయిలు చెల్లించారు. దీంతో ఈ నెల 7వరకు ట్రాన్స్‌పోర్ట్ జరిగింది. మళ్లీ బకాయిల చెల్లింపు విషయమై సమస్య రావడంతో వైన్‌షాపులకు సరఫరా నిలిచింది.

50 రోజులు.. రూ.185కోట్లు

- ఉపాధిహామీ కూలీలకు అందని వేతనాలు

(టెక్కలి)

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో కూలీలకు వేతనాలు సకాలంలో అందడం లేదు. మే 20 నుంచి చెల్లింపులు నిలిచిపోయాయి. రూ.185కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి. దీంతో వేతనదారులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో సుమారు 2.72 లక్షల మంది ఉపాధిహామీ కూలీలు ఉన్నారు. వేతనదారులు చెరువులు, గెడ్డలు, కాలువలు, బౌండ్రీ ట్రెంచ్‌లు, రింగ్ ట్రెంచ్‌లు, ఫారంబాండ్స్ వంటి పనుల్లో పాల్గొన్నారు. సంతబొమ్మాళి, ఎచ్చెర్ల, రణస్థలం, లావేరు, మందస ప్రాంతాల్లో అత్యధికంగా ఉపాధి హామీ పనులు చేపట్టారు. వజ్రపుకొత్తూరు, కవిటి, సోంపేట, పలాస, హిరమండలం ప్రాంతాల్లో అరకొరగా పనులు చేశారు. ఉపాధిహామీ కూలీలకు ఒకటి, రెండు వారాల్లో వేతనాలు చెల్లించేవారు. ఈసారి మాత్రం మే 20నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో కూలీలు ఆందోళన చెందుతున్నారు. కుటుంబ పోషణ భారమవుతోందని వాపోతున్నారు. వేతనాల చెల్లింపులో జాప్యానికి కారణమేంటని ఫీల్డ్‌అసిస్టెంట్లు, ఏపీవోలను ప్రశ్నిస్తున్నారు. కొన్నిచోట్ల ప్రజాప్రతినిధులు కూడా వేతనాల జాప్యంపై క్షేత్రస్థాయి అధికారులను నిలదీస్తున్నారు. వేతనాలు సక్రమంగా చెల్లించాలని కూలీలు కోరుతున్నారు. ఈ విషయమై డ్వామా పీడీ చిట్టిరాజు వద్ద ప్రస్తావించగా.. జిల్లాలో రూ.185కోట్ల మేర వేతన బకాయిలున్నాయని తెలిపారు. ఉపాధి కూలీలకు త్వరలో వేతనాలు చెల్లిస్తామన్నారు.



ఉపాధిహామీ పనులు చేస్తున్న వేతనదారులు



పనులు పరిశీలిస్తున్న పంచిరెడ్డి సత్యనారాయణ తదితరులు

ఇలా అయితే.. సాగునీరు కష్టమే

- నారాయణపురం కాలువకు అడ్డంగా నిర్మాణం
- అధికారులకు రైతుల ఫిర్యాదు

ఎచ్చెర్ల, జూలై 9: తోటపాలెం అర్బన్ హౌసింగ్ సమీపంలో.. నారాయణపురం కుడికాలువకు అడ్డంగా ఓ వ్యక్తి నిర్మాణం చేపట్టాడు. 24/2 బ్రాంచ్ చానల్ వద్ద అడ్డంగా గొట్టాలు వేసి రహదారి ఏర్పాటు చేశాడు. దీంతో తమకు సాగునీటికి ఇబ్బందులు తప్పవని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. నారాయణపురం ప్రాజెక్ట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు పంచిరెడ్డి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ పంచిరెడ్డి కృష్ణారావుతోపాటు వెంకన్నగారిపేట రైతులు నిర్మాణ పనులను పరిశీలించారు. దీనిపై మంగళవారం జలవనరుల శాఖాధికారులకు ఫిర్యాదు చేశారు. 'బ్రాంచ్ చానల్ ద్వారానే పొన్నాడ, తెప్పరేవు, వెంకన్నగారిపేట, తోటపాలెంలో కొంతభాగానికి సాగు నీరందుతుంది. ఇప్పటికే బ్రాంచ్ చానల్ ద్వారా అరకొరగానే సరఫరా నీరు అవుతోంది. ఇలాంటి నిర్మాణాల వల్ల సాగునీటికి మరింత ఇబ్బందులు తప్పవ'ని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణాలు అడ్డుకోవాలని కోరారు. ఈ విషయమై జలవనరుల శాఖ డీఈఈ మురళీమోహన్ వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు చేపడతామన్నారు.

దిక్సూచి DIKSUCHI

ఐఎస్‌బీలో మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లు



ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)- మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్, పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. హైదరాబాద్, మొహాలీ క్యాంపస్‌లు వీటిని అందిస్తున్నాయి. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్‌లు పూర్తిచేసినవారికి ప్లేస్‌మెంట్స్ కల్పిస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 28**
- **వెబ్‌సైట్: isb.edu**

పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లు

పీజీపీ ఇన్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇది ఫుల్ టైమ్ రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. దీనిని ఎంబీఏ డిగ్రీకి సమానంగా పరిగణిస్తారు. ఇందులో భాగంగా ఇంటర్నేషనల్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ కూడా ఉంటుంది.
అర్హత: ఏదేని డిగ్రీ/పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. జీమ్యాట్/జీఆర్ఈ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. కనీసం రెండేళ్ల ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 15

పీజీపీఎంఏఎక్స్: ప్రోగ్రామ్ వ్యవధి 15 నెలలు. దీనిని సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లకు, బిజినెస్ ఓనర్స్‌కు ఉద్దేశించారు. ఇది ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ డిగ్రీకి సమానం. ప్రోగ్రామ్ మొత్తానికి 24 క్రెడిట్లు నిర్దేశించారు.
అర్హత: ఏదేని డిగ్రీ/సీఏ/ఐసీడబ్ల్యూఏఐ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. కనీసం పదేళ్ల అనుభవం ఉండాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 1

పీజీపీప్రో: ప్రోగ్రామ్ వ్యవధి 18 నెలలు. దీనిని వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ప్రత్యేకించారు. ముంబై, బెంగళూరు క్యాంపస్‌లలో ఈ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఇది వీకెండ్ ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ ప్రోగ్రామ్‌నకు సమానం. ఫైనాన్స్, మార్కెటింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.
అర్హత: ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు కనీసం అయిదేళ్ల అనుభవం ఉండాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 18

పీజీపీఎంఎఫ్ఏబీ: ప్రోగ్రామ్ వ్యవధి 15 నెలలు. ఇది మాడ్యులర్ ప్రోగ్రామ్. దీనిని కుటుంబ పరంగా సొంత బిజినెస్‌లు నిర్వహిస్తున్నవారికి ఉద్దేశించారు. ఇందులో బిజినెస్ ఆపరేషన్స్, మేనేజ్‌మెంట్ మెథడాలజీ, టూల్స్ అండ్ టెక్నిక్స్, లీడర్‌షిప్ టెక్నిక్స్ నేర్పిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా రెండు ఇంటర్నేషనల్ ఇమ్మర్షన్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి.
అర్హత: ఏదేని డిగ్రీ/సీఏ ఉత్తీర్ణులై ఉండాలి. అనుభవం తప్పనిసరి కానప్పటికీ కనీసం రెండు నుంచి మూడేళ్ల అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
దరఖాస్తు ఫీజు: రూ.15,000
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మొదటి రౌండ్‌కు నవంబరు 10; రెండో రౌండ్‌కు 2025 మార్చి 9

అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ ఇన్ బిజినెస్ అనలిటిక్స్(ఏఎంపీబీఏ)

ప్రోగ్రామ్ వ్యవధి 15 నెలలు. ఇది హైబ్రిడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్. ప్రోగ్రామ్‌లో భాగంగా డేటా మేనేజ్‌మెంట్, ప్రోగ్రామింగ్, స్టాటిస్టిక్స్, మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బిజినెస్ అప్లికేషన్స్ అంశాలకు సంబంధించి థియరీ సెషన్స్, ప్రాక్టికల్ ట్రెయినింగ్ ఉంటాయి. ఫౌండేషనల్ ప్రాజెక్ట్‌లు, క్యాప్‌స్టోన్ ప్రాజెక్టులు పూర్తిచేయాల్సి ఉంటుంది. సంస్థ నిర్వహించే ఆన్‌లైన్ అడ్మిషన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.
అర్హత: ఇంజనీరింగ్, టెక్నాలజీ, స్టాటిస్టిక్స్, మేథమెటిక్స్ సైన్స్ విభాగాల్లో డిగ్రీ/పీజీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. మేథమెటిక్స్, ప్రోగ్రామింగ్ అంశాల్లో పూర్తి పరిజ్ఞానం ఉండాలి. అడ్మిషన్ నాటికి కనీసం రెండేళ్ల ప్రొఫెషనల్ అనుభవం తప్పనిసరి. జీమ్యాట్/జీఆర్ఈ/క్యాట్/ఎన్‌మ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు అడ్మిషన్ టెస్ట్ రాయనవసరం లేదు.

'సర్దార్ పటేల్' టెక్స్‌టైల్ స్కూల్లో డిగ్రీ, ఎంబీఏ

కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ, కోయంబత్తూరులో నిర్వహిస్తున్న సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ టెక్స్‌టైల్స్ అండ్ మేనేజ్‌మెంట్(ఎస్‌వీపీఐటీఎం)-డిగ్రీ, ఎంబీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్(ఎస్‌వీపీఈటీ)/సీయూఈటీ స్కోర్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఎంబీఏ ప్రోగ్రామ్‌నకు ఇతర మేనేజ్‌మెంట్ ఎంట్రెన్స్ టెస్ట్ స్కోర్‌లను కూడా అనుమతిస్తారు.

డిగ్రీ ప్రోగ్రామ్‌లు: మూడేళ్ల వ్యవధి గల బీఎస్సీ (టెక్స్‌టైల్స్/టెక్నికల్ టెక్స్‌టైల్స్), బీబీఏ టెక్స్‌టైల్ బిజినెస్ అనలిటిక్స్; నాలుగేళ్ల వ్యవధి గల బీఎస్సీ(టెక్స్‌టైల్ అండ్ అప్పారెల్ డిజైన్)(ఆనర్స్/రీసెర్చ్) ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఇవి ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లు. బీఎస్సీ(టెక్స్‌టైల్ అండ్ అప్పారెల్ డిజైన్)(ఆనర్స్/రీసెర్చ్) ప్రోగ్రామ్‌లో మూడేళ్ల కోర్సు పూర్తిచేసిన తరవాత బీఎస్సీ(టెక్స్‌టైల్ అండ్ అప్పారెల్ డిజైన్) డిగ్రీతో ప్రోగ్రామ్‌నుంచి వైదొలగే వీలుంది.

ఎంబీఏ: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో టెక్స్‌టైల్ మేనేజ్‌మెంట్, అప్పారెల్ మేనేజ్‌మెంట్, రిటైల్ మేనేజ్‌మెంట్, టెక్నికల్ టెక్స్‌టైల్స్ మేనేజ్‌మెంట్, టెక్స్‌టైల్ బిజినెస్ అనలిటిక్స్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

ఎస్‌వీపీ ఎంట్రెన్స్ టెస్ట్: దీనిని ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 50 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం గంట.

షార్ట్ టర్మ్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు: మెడికల్ టెక్స్‌టైల్ మేనేజ్‌మెంట్, నాన్ వోవెన్ టెక్స్‌టైల్స్ మేనేజ్‌మెంట్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ అప్లికేషన్స్ ఇన్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. మొదటి రెండు ప్రోగ్రామ్‌ల వ్యవధి 30 గంటలు. చివరి ప్రోగ్రామ్ వ్యవధి 15 గంటలు. వీటిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్/ఓబీసీ అభ్యర్థులకు రూ.500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు దరఖాస్తు ఫీజు లేదు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **వెబ్‌సైట్:** www.svpitm.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/SCMrlySలో చదవండి.

SCHOLARSHIP ALERT

Description: An initiative of Aadhar Housing Finance Limited(AHFL) to ensure equal educational opportunities for all physically disabled students, irrespective of their geographical location, gender, or socio-economic condition.

Aadhar Kaushal Scholarship Program for Youth with Disabilities

Eligibility: Students with physical disabilities pursuing general or professional undergraduate courses across India. Pan-India students can apply. Students must have achieved a minimum of 60% marks in the preceding academic year. Applicants with a gross annual family income of up to INR 2.5-3 lakh are eligible to apply.
Prizes & Rewards: Scholarship between INR 10,000 - INR 50,000 **Last Date:** 23-07-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/AKSP1

Muskaan Scholarship Program

Description: A CSR initiative by Valvoline Cummins to offer financial assistance and mentorship support to children of commercial drivers(LMV/HMV), mechanics and individuals from the Economically Weaker Section (EWS) category, ensuring continuity in their education.
Eligibility: Students studying in Classes 9 to 12 from the southern, eastern, and north-eastern states (Assam, Manipur, Nagaland, Mizoram, Tripura, Aru nachal Pradesh, Sikkim, Odisha, Bihar, Puducherry, Chhattisgarh, Kerala, Telangana, Andhra Pradesh, Jharkhand, Karnataka, Meghalaya, Tamil Nadu, and West Bengal) are eligible to apply. The scholarship is available to children of commercial drivers (LMV/ HMV), mechanics and children from the Economi cally Weaker Section (EWS) category. Applicants must have scored 60% or above in their previous class to be eligible. The total family income from all sources should not exceed INR 8 lakh per annum.
Prizes & Rewards: Scholarship of up to INR 12,000 and mentorship support
Last Date to Apply: 03-09-2024
Application mode: Online Application only
Short Url: www.b4s.in/aj/MKSP1

IDFC FIRST Bank MBA Scholarship

Description: IDFC FIRST Bank MBA Scholarship is a need-based scholarship program run by IDFC FIRST Bank to financially support students with a family income of less than INR 6 lakh per annum. The purpose of this scholarship is to make post-graduate studies in business management accessible to meritorious students who are unable to pursue higher studies due to financial constraints.
Eligibility: Indian students enrolled in the first year of a 2-year full-time MBA program for the class of 2024 at selected educational institutions may apply for this scholarship. Applicants' gross annual family income should be less than or equal to INR 6 lakh. Applicants must have a valid mobile number linked to their Aadhaar number.
Prizes & Rewards: INR 2 lakh for 2 years of MBA studies (INR 1 lakh/year)
Last Date to Apply: 31-07-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/IFBMS5

buddy4study.com


నవ్య | చిత్రజ్యోతి

వెబ్ సిరీస్‌లో త్రిష



హీరోయిన్ త్రిష తొలిసారిగా ఓ వెబ్ సిరీస్‌లో నటిస్తున్నారు. అనూహ్యమైన మలుపులతో, ఉత్కంఠభరితంగా సాగే ఆ సిరీస్ పేరు 'బృంద'. సోనీ లివ్‌లో ఆగస్టు 2న ఇది స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, మరాఠి, బెంగాలీ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ అవుతుండడం విశేషం. ఈ సిరీస్ గురించి దర్శకుడు సూర్య మనోజ్ వంగాల మాట్లాడుతూ 'ఆద్యంతం సస్పెన్స్‌తో 'బృంద' సిరీస్ సాగుతుంది. శక్తిమంతమైన ఫిమేల్ లీడ్ నేరేటివ్ స్టోరీ ఇది. దీన్ని చూశాక ఇప్పటిదాకా నమ్ముతున్న నమ్మకాల మీద ఫోకస్ పెరుగుతుంది. ఈ జోనర్‌లో వచ్చే సినిమాలకు కొత్త నిర్వచనం చెప్పేలా ఉంటుంది' అన్నారు. సూర్య మనోజ్ వంగాల, పద్మావతి మల్లాది కలసి రూపొందించిన స్క్రీన్‌ప్లే సిరీస్‌కు హైలైట్ అవుతుందని అంటున్నారు. డ్రామా, క్రైమ్, మిస్టరీ అంశాలతో రూపొందిన ఈ సిరీస్‌కు శక్తికాంత్ కార్తిక్ సంగీతం అందించారు. దినేష్ కె బాబు ఛాయాగ్రాహకుడు. ఇంద్రజిత్ సుకుమారన్, జయప్రకాశ్, ఆమని, రవీంద్ర విజయ్, ఆనంద్ సామి, రాకేందు మౌళి తదితరులు నటించారుజ

కేస్ నంబర్ 15 ఏమిటి?



అజయ్, రవిప్రకాశ్, హర్షిణి, మాండవియ సెజల్, చమ్మక్ చంద్ర, చిత్రం శ్రీను ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'కేస్ నం.15'. తడకల వంకర్‌రాజేశ్ స్వీయ నిర్మాణంలో తెరకెక్కుతున్న 'కేస్ నం.15' ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా తడకల వంకర్‌రాజేశ్ మాట్లాడుతూ "సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్న ఈ చిత్రంలోని సన్నివేశాలు ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తాయి. సినిమాను ఎక్కడా రాజీ పడకుండా తెరకెక్కించాం. ఇందులో నటించిన ప్రతి ఒక్కరికీ మంచి పేరు వస్తుంది" అని చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: ఆర్.కె.స్వామి, సినిమాటోగ్రఫీ: ఆనమ్ వెంకట్, సంగీతం: జాన్.

భారతీయుడు-2 బృందానికి సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు





భారతీయుడు-2 సినిమా బృందానికి సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రజా ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నానికి మద్దతుగా నటుడు కమల్‌హాసన్‌తో పాటు చిత్ర బృందం శంకర్, సిద్ధార్థ, సముద్రఖని కలిసి డ్రగ్స్ వాడకానికి వ్యతిరేకంగా అవగాహన వీడియో రూపొందించడం హర్షించదగ్గ విషయమన్నారు. కాగా గత వారం కమాండ్ కంట్రోల్ సెంటర్ వద్ద యాంటీ నార్కొటిక్స్ బ్యూరోకు కొత్త వాహనాలు ప్రారంభించిన సమయంలో డ్రగ్స్ నిర్మూలనకు సినీ పరిశ్రమ తమ వంతు సహకారం అందించాలని సీఎం సూచించారు. ప్రతి సినిమా విడుదల సమయంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నటీనటులు కనీసం రెండు నిమిషాల నిడివితో వీడియో చిత్రీకరించి ఇవ్వాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు సినీ ప్రముఖులు, క్రీడా కారులు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేస్తున్నారు.

నా మాటల్ని అపార్థం చేసుకున్నారు

'భారతీయుడు 2' ప్రమోషన్స్‌లో భాగంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో తను మాట్లాడిన మాటల్ని అపార్థం చేసుకున్నారని సిద్ధార్థ్ చెప్పారు. డ్రగ్స్ కట్టడికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతు ఇస్తాను. సీఎం సార్.. మేం ఎప్పుడూ మీతోనే" అంటూ ప్రత్యేకంగా విడుదల చేసిన వీడియోలో ఆయన పేర్కొన్నారు.

దర్శకుడే హీరో!

కాన్సెప్ట్ బేస్డ్ సినిమాలకు ప్రేక్షకుల ఆదరణ ఎక్కువగా లభిస్తున్న ప్రస్తుత తరుణంలో దర్శకనిర్మాతలు ఇప్పుడు విభిన్న కథాంశాలను ఎన్నుకుంటూ చిత్రాలు నిర్మిస్తున్నారు. ఆ కోవలో వస్తున్న మరో చిత్రం 'కళింగ'. ఇంతకుముందు 'కిరోసిన్' చిత్రంలో నటించిన ధ్రువ వాయు ఈ సినిమాలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. దర్శకుడు కూడా ఆయనే. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సీనియర్ రైటర్ విజయేంద్రప్రసాద్ విడుదల చేశారు. సాంస్కృతిక శాఖ సంచాలకుడు



మామిడి హరికృష్ణ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పోస్టర్‌లో హీరో, అతని వెనుక ఉగ్ర రూపంలో ఉన్న లక్ష్మీ నరసింహస్వామి విగ్రహం, హీరో చేతిలో కాగడ... ఇవన్నీ సినిమా మీద ఆసక్తి పెంచుతున్నాయి. ప్రగ్యా నయన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో 'ఆడుకాలం' నరేన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. మురళీధర్ గౌడ్, లక్ష్మణ్, తనికెళ్ల భరణి, సమ్మెట గాంధీ, బలగం సుధాకర్, సంజయ్‌కృష్ణ, హరిశ్చంద్ర తదితరులు ఇతర ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. ఈ చిత్రానికి నిర్మాతలు దీప్తి కొండవీటి, పృథ్వీ యాదవ్.

వినోదాత్మకంగా పేకమేడలు



'నా పేరు శివ', 'అంధగారం' 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న వినోద్‌కిషన్ లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'పేకమేడలు'. అనూష కృష్ణ హీరోయిన్‌గా నటిస్తున్నారు. నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో 'ఎవరికీ చెప్పొద్దు' సినిమా ఫేమ్ రాకేశ్ వర్రే సినిమాను నిర్మిస్తున్నారు. టీజర్, పాటలు లాంచ్ చేసి.. ఇప్పటికే పలు రకాల విభిన్న ప్రమోషన్ కార్యక్రమాలతో అందరినీ ఆకట్టుకుంది చిత్రబృందం. మంగళవారం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు నీలగిరి మామిళ్ల మాట్లాడుతూ "సామాన్యుల జీవితాల్లో జరిగే సంఘటనల ఆధారంగా ఈ సినిమా కథను రాసుకున్నాను. వినోదంతో పాటు భావోద్వేగాలను మిళితం చేసిన సినిమా ఇది" అని అన్నారు. చిత్ర నిర్మాత రాకేశ్ వర్రే మాట్లాడుతూ "ఇది కేవలం ఒక వినోదాత్మక చిత్రమే కాదు.. ఒక భార్య తన భర్తకు అన్ని వేళలా ఎంతగా సపోర్ట్ చేస్తుందో చూపించే చిత్రం" అని చెప్పారు. "ఈ సినిమా అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను" అని హీరో వినోద్‌కిషన్ అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: సృజన అడుసుమిల్లి, హంజా అలీ, డీఓపీ: హరిచరణ్.కె, సంగీతం: స్మరణ్‌సాయి.

నాగులాపురం నాగమ్మ



మంచు లక్ష్మీ ప్రధాన పాత్రలో నటిస్తున్న పాన్ ఇండియా పీరియాడికల్ డ్రామా 'ఆది పర్వం'. శివకంఠంనేని, ఆదిత్య ఓం, ఎస్తర్ నోరోనా, శ్రీజిత ఘోష్, సుహాసిని కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సంజీవ్ మేగోటి దర్శకత్వంలో ఎమ్.ఎస్.కె.రచన నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ సినిమా సాంగ్‌ను మేకర్స్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా సంజీవ్ మేగోటి మాట్లాడుతూ "ఈ సినిమాలో మంచు లక్ష్మీ 'నాగులాపురం నాగమ్మ'గా నటిస్తున్నారు. ఆ పాత్రలో ఆమె నట విశ్వరూపం చూస్తారు. ఆమె చేసిన యాక్షన్ సీక్వెన్సులు సినిమాకే హైలైట్" అని చెప్పారు. "ఆదిపర్వం' మీ అందరికీ నచ్చేలా ఉంటుంది" అని మంచు లక్ష్మీ అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: పవన్ శేఖర్ పసుపులేటి, సినిమాటోగ్రఫీ: ఎస్.ఎన్.హరీశ్, సంగీతం: మాధవ్ సైబా, సంజీవ్ మేగోటి, బి.సుల్తాన్ వలి, ఓపెన్ బనానా, లుబెక్ లీ మార్విన్.

ఈ గ్యాప్ నాకు చాలా నేర్పింది



'నన్ను దోచుకుందువటే' చిత్రంతో ఆరంగేట్రం చేసి.. వరుస సినిమాల్లో నటించారు నభా నటేశ్. కానీ 2021లో వచ్చిన 'మాస్ట్రో' సినిమా తర్వాత తెరపై కనిపించలేదు. ఈ విరామానికి కారణాన్ని ఆమె లేటెస్ట్‌గా నటించిన 'డార్లింగ్' సినిమా ట్రైలర్ లాంచ్‌లో తెలిపారు. "2022లో నాకు యాక్సిడెంట్ అయ్యింది. ఆ సమయంలో నా చేతిలో మూడు ప్రాజెక్ట్స్ ఉన్నందున.. వాటిని పూర్తి చేసేందుకు సర్జరీ చేసుకుని తగినంత విరామం లేకుండా సెట్స్‌లో అడుగుపెట్టాను.. దాంతో ఆ గాయం తిరగబెట్టింది. అందుకే ఇన్నేళ్లు సినిమాలకు దూరంగా ఉండాల్సి వచ్చింది. ఇప్పటివరకూ నేను గ్లామరస్ పాత్రలే ఎక్కువ పోషించాను. ఈ గ్యాప్ నాకు చాలా నేర్పింది. ఇప్పటి నుంచి నటనా ప్రాధాన్యమున్న పాత్రల్లోనూ నటించాలనుకుంటున్నాను. అందుకే స్క్రిప్ట్‌ల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నాను" అని చెప్పారు. నభా నటించిన 'డార్లింగ్' చిత్రం ఈ నెల 19న విడుదల కానుండగా, ఆమె నటిస్తున్న 'స్వయంభు' చిత్రం ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/sLtj82Y
లో చదవండి.

గుండెపోటుతో ఉషా ఉతప్ భర్త కన్నుమూత



ప్రముఖ గాయని ఉషా ఉతప్ ఇంట్లో విషాదం చోటు చేసుకుంది. ఆమె భర్త జానీ చాకో ఉతప్ సోమవారం రాత్రి కన్నుమూశారు. ఆయన వయసు 78 ఏళ్లు. కోల్‌కతాలోని వారి ఇంట్లో టీవీ చూస్తున్న సమయంలో ఆయనకు గుండె పోటు రావడంతో హుటాహుటిన ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే ఆయన మరణించారని వైద్యులు తెలిపారు. ఈ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

జై జగన్నాథ

● కూర్మ, వరాహావతారాల్లో దర్శనం

జగన్నాథ రథయాత్ర సందర్భంగా మంగళవారం స్వామి కూర్మ, వరాహావతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా గుండిచా మందిరాల్లో విశేష పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం




టెక్కలి, పాతపట్నంలలో కూర్మావతారంలో జగన్నాథుడు




ఎల్ఎన్‌పేట, జలుమూరు మండలాల్లో వరాహావతారంలో..





నరసన్నపేట, కొత్తూరు: నివగాం, కంచిలిలో కూర్మావతారంలో..



ఇచ్ఛాపురం: పరశురామ, వరాహావతారాల్లో..




సోంపేట, శ్రీకాకుళంకల్చరల్: మొండేటి వీధిలో ..

పరిసరాల పరిశుభ్రత లేకుంటే అధికారులు విఫలమైనట్లే..

పాతపట్నం: ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా లేకుంటే సంబంధిత అధికారులు విధి నిర్వహణలో విఫలమైనట్లేనని ఎంపీడీవో కె.రామకృష్ణరాజు అన్నారు. చంగుడి, సరాళి, దశరథపురం గ్రామాల్లో పాఠశాలలు, ఆర్బీకేలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీ కార్యాలయాలను మంగళవారం సందర్శించారు. పరిసరాల్లో చెత్త చెదారాలు లేకుండా పరిశుభ్రంగా ఉంచకుంటే ఎలా అని ప్రశ్నించారు. పాఠశాలల ప్రాంగణాలు పరిశుభ్రంగా ఉంచి విద్యార్థులకు మార్గదర్శకంగా నిలవాలన్నారు. ప్రతి శుక్రవారం గ్రామాల్లోని నీటి ట్యాంక్‌లు శుభ్రం చేయాలని, క్లోరినేషన్ చేయించాలని సూచించారు. అలాగే తీమర, తామర, సీది గ్రామాల్లో ఈవోపీఆర్డీ టి.కృష్ణారావు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాలు, ఆర్బీకేలను సందర్శించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలపై అధికారుల దాడులు

మందస: మందస గ్రామ పంచాయతీ గోపాలసాగర్ సమీపంలో మట్టి అక్రమ తరలింపు చేస్తున్నారన్న సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు మంగళవారం దాడులు చేశారు. గోపాలసాగరం నుంచి రియల్ ఎస్టేట్‌కు మట్టిని తరలిస్తున్నారన్న సమాచారం మేరకు తహసీల్దార్ ఎల్.తిరుమలబాబు, డీటీ ఎం.కృష్ణమూర్తి, ఆర్ఐ చిన్నారావు పోలీసు సిబ్బందితో కలిసి సదరు ప్రాంతాన్ని సందర్శించారు. మట్టి తీస్తున్న రెండు ఎక్స్‌కవేటర్లు, ఆరు ట్రాక్టర్లను పట్టుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. తహసీల్దార్ తిరుమలబాబు మాట్లాడుతూ.. మైన్స్ అధికారులతో మాట్లాడి జరిమానా విధిస్తామన్నారు. నిందితులను బుధవారం కోర్టులో హాజరుపర్చడం జరుగుతుందని తెలిపారు.



మట్టిని తరలిస్తున్న దృశ్యం

సకాలంలో తెగుళ్ల నివారణ ద్వారా అధిక దిగుబడి

రావిచెంద్రి(ఎల్.ఎన్.పేట): వ్యవసాయం చేసే రైతులు పంటలకు సోకే తెగుళ్లను సకాలంలో గుర్తించి నివారణ చర్యలు తీసుకోవడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని కొత్తూరు డివిజన్ వ్యవసాయశాఖ ఏడీ బి.రాజగోపాల్ అన్నారు. రావిచెంద్రి గ్రామంలో ఏవో పి.లతాశ్రీ అధ్యక్షతన మంగళవారం కౌలు రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కౌలు రైతులు సంబంధిత అధికారులతో గుర్తింపు కార్డులుపొందాలన్నారు. గుర్తింపు పొందిన కౌలు రైతులకు ప్రభుత్వం అందించనున్న వివిధ పథకాలు వర్తిస్తాయన్నారు. రైతులు మట్టినమూనా పరీక్షలు చేయించుకుని వ్యవసాయాధికారుల సూచనల మేరకు పంటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎస్.గవరయ్య, రావి చెంద్రి, కోవిలాం సర్పంచ్‌లు కె.లక్ష్మునాయుడు, ఎన్.నారాయణరావు, మాజీ జడ్పీటీసీ ఎస్.తేజేశ్వర రావు, పంచాయతీ కార్యదర్శి విష్ణు, రైతులు పాల్గొన్నారు.

కౌలురైతుల అవగాహన సదస్సు

నందిగాం: కాపుతెంబూరులో మంగళవారం కౌలురైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయాధికారి పి.శ్రీకాంత్‌వర్మ మాట్లాడుతూ.. ప్రతి కౌలురైతు సాగు ధ్రువీకరణ పత్రాలు పొందడం ద్వారా మేలు జరుగుతుందన్నారు. ప్రభుత్వ పథకాలు, రాయితీలు పొందాలంటే గుర్తింపు కార్డులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కె.తాతయ్య టీడీపీ నాయకులు కె.హరిబాబు, పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక విక్రయాలు ప్రారంభం

టెక్కలి: స్థానిక ఆర్టీసీ గ్యారేజ్ సమీపంలో డంపింగ్ యార్డులో ఇసుక విక్రయాలను మంగళ వారం సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, మైన్స్ ఏడీ ఫణిభూషణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ట్రాక్టర్ రూ.1,700 చొప్పున ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇసుక విక్రయాలు జరుగుతాయన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి రిబ్బన్ కట్ చేసి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో ఈ ప్రాంత ప్రజలు, భవన నిర్మాణ కార్మికులకు ఇసుకను అందజేయడం జరుగుతోందన్నారు. ఇసుకను ఉచితంగా ఇస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నిలబెట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో నేతలు హనుమంతు రామకృష్ణ, మట్ట పురుషోత్తం, మెండ దమ యంతి, మామిడి రాము, పోలాకి షణ్ముఖరావు, దోని బుజ్జి, దల్లి ప్రసాద్‌రెడ్డి, ప్రీతీష్, మల్లిపెద్ది మధు, ఇప్పిలి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



రసీదును అందిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, టీడీపీ నేతలు

ఇసుకను అక్రమంగా తరలిస్తే సహించేదిలేదు: ఎమ్మెల్యే

హిరమండలం: హిరమండలంలోని నౌగూడ సమీపంలో నిలిచి ఉన్న ఇసుకలోడ్ లారీని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తనిఖీ చేశారు. ఎమ్మెల్యే కొత్తూరు నుంచి హిరమండలం వైపు వస్తుండగా నౌగూడ వద్ద ఇసుక లోడు లారీ నిలిచి ఉంది. దీనిని గమనించిన ఎమ్మెల్యే తనిఖీ చేసి ధ్రువపత్రాలను పరిశీలించారు. ధ్రువపత్రాలు క్యూఆర్ స్కాన్ చేస్తే ఎలాంటి వివరాలు చూపించపోవడంతో పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇతర ప్రాంతాల నుంచి ఇసుకను తరలిస్తున్నారన్నారు. ఒడిశా నుంచి వచ్చి ఆంధ్రాలో ఇసుక తీసుకు పోతున్నారన్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. పెనుగూడ నుంచి వచ్చిన లారీలను తనిఖీ నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. నకిలీ ధ్రువపత్రాలతో ఎక్కువగా ఒడిశా నుంచి ఇసుక తరలిస్తున్నారన్నారు.



ఇసుక లారీ ధ్రువపత్రాలను పోలీసులకు అప్పగిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

వర్షం కురవాలని అమ్మవారికి చల్లదనం

సంతబొమ్మాళి: బోరుభద్ర గ్రామంలో వర్షం కురవాలని కోరుతూ గ్రామదేవత పాలపోలమ్మ తల్లికి మంగళవారం చల్లదనం చేపట్టారు. జూలై నెల ప్రారంభమై వారం రోజులైనా వర్షాలు కురవ కపోవంతో మేళతాళాలలో ఊరేగింపుగా వచ్చి పసుపు, కుంకుమలతో ముర్రాటలు పోసి చల్లదనం చేశారు. పాయసం, బూరెలు అమ్మవారికి ప్రసాదంగా సమర్పించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ● **నందిగాం:** నందిగాంలో గ్రామదేవతలకు మంగళవారం భక్తులు చల్లదనం చేశారు. ఆవేటి వారాలను పురస్కరించుకొని పాతపట్నం అమ్మ, సండెమ్మ, చింతపోలమ్మ, సామాలమ్మ, భూలోకమ్మ తది తర గ్రామదేవ తలకు మహిళలు ముర్రాటలతో వెళ్లి చల్లదనం చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఒడిశా

ప్రజావినతులకు భారీ స్పందన

పర్లాకిమిడి: గుమ్మా సమితి తొరబ గ్రామ పంచాయతీలో జిల్లా కలెక్టర్ స్మృతిరంజన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రజావినతుల స్వీకరణ చేపట్టారు. ఉక్రా, రగిడి, గుమ్మా పంచాయతీల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు హాజరై వినతులు అందించారు. మొత్తం 126 ఫిర్యాదులు అందగా వాటిలో 39 గ్రామ ఫిర్యాదులు, 87 వ్యక్తిగతం రాగా 51 ఫిర్యాదులు అక్క డికక్కడే పరిష్కరించారు. ముగ్గురుకు సీఎం సహాయ నిధి నుంచి రూ.15 వేలు అందించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్వాతి, ఎస్.కుమార్, బీడీవో అకాశ్‌కుమార్‌పండా, తహసీల్దార్ దేవీప్రసన్న, సమితి అధ్యక్షురాలు సునేమిమండల్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మత్స్య,కూర్మావతారంలో జగన్నాథుడు

పర్లాకిమిడి: జగన్నాథుడి రథయాత్ర సందర్భంగా మంగళవారం గుండిచా మందిరంలో స్వామి వారు మత్స్య, కూర్మావతారాల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా వేల సంఖ్యలో భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలు పంపిణీ చేయగా, జగన్నాథ రథయాత్ర పౌర్ణమి వరకూ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. రథయాత్రలో ఎమ్మెల్యే రూపేష్‌కుమార్ పాణిగ్రాహి పాల్గొని అన్నప్రసాదాన్ని పంపిణీ చేపట్టారు.

శివారు భూములకు సాగునీరందించేందుకు కృషి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

హిరమండలం: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వంశధార ఎడమ కాలువ ద్వారా శివారు భూములకు సాగునీరందించేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మంగళవారం హిరమండలం వద్ద జరుగుతున్న వంశధార రిజర్వాయర్ పనుల్లో భాగంగా అనుసంధానంగా చేపడుతున్న స్పిల్‌వే, ఎత్తిపోతల పథకం పనులతో పాటు గొట్టా బ్యారేజీని పరిశీలించారు. ప్రాజెక్టు స్థితిగతులను ఎస్ఈ బి.రాంబాబు, ఈఈ ఎంవీరమణ కలెక్టరకు వివరించారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ.. రూ.54 లక్షలతో ఎడమ కాలువలో పూడికలు తీశారన్నారు. ఇప్పటికే పలాస వరకు సాగునీరు పంపించడం జరిగిందన్నారు. అలాగే కుడి ప్రధాన కాలువ ద్వారా పనులు చేపడుతున్నామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులెదురైనా వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులను గాని, కలెక్టర్ కార్యాలయంలోగాని తెలియజేయాలన్నారు. రిజర్వాయర్ పనులతో పాటు ఆర్ఆర్ ప్యాకేజి, భూసేకరణ సమస్యలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు. కార్యక్రమంలో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమల్, వంశధార డీఈఈలు రవికాంత్, సురేష్, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.



వంశధార రిజర్వాయర్ పనులకు వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

మాజీ మంత్రి మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారు

● టీడీపీ మండల నాయకుల ధ్వజం

హరిపురం: అధికారం కోల్పోయిన తరువాత మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని మందస మండల టీడీపీ నాయకులు ధ్వజమెత్తారు. మంగళవారం హరిపురం పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధనతో పాటు నేతలు విలేకరులతో మాట్లాడుతూ.. ప్రశాంతంగా ఉండే హరిపురంలో ఎలక్ట్రికల్ దుకాణంలో అగ్నిప్రమాదం సంభవించడంపై విచారం వ్యక్తం చేశారు. దీనిపై బాధితుడ్ని పరామర్శించిన మాజీ మంత్రి మతిస్థిమితం కోల్పోయిన వాడిలా ప్రవర్తించి టీడీపీ నాయకులపై నిందలు వేయడం సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నాయన్నారు. విచక్షణతో మాట్లాడటం నేర్చుకోవాలని హితవు పలికారు. బజారువీధిలోని పలు దుకాణాల వద్ద సీసీ కెమెరాలున్నాయని వాటిని పూర్తిస్థాయిలో పరిశీలించి ఎలక్ట్రికల్ దుకాణంలో అగ్నిప్రమాదానికి కారణమైన నిందితులను పట్టుకుని చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దాసరి తాతారావు, లబ్బ రుద్రయ్య, బైరిశెట్టి గున్నయ్య, పుల్లా వాసు, కొట్ర రామారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు దుర్యోధనరావు

ప్రతి ఎకరాకూ సాగునీరివ్వడమే లక్ష్యం: ఎమ్మెల్యే బగ్గు

నరసన్నపేట: ప్రతి ఎకరాకూ సాగునీరు, ప్రతి ఇంటికీ తాగునీరందించమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా కృషి చేస్తోందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ ఆరంగి మురళి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాలు అభివృద్ధికి సభ్యులంతా సహకరించాలని, పదవులు శాశ్వతం కాదని చేసే పనులే శాశ్వతమన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలపేతం చేయాలని, అందుకు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు జాయినయ్యేలా ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. సాగు, తాగునీరు, విద్య, పేదలకు వైద్యసేవలను అందించేందుకు ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామాల్లో జలజీవన్ మిషన్ పథకంలో ఇంటింటికీ తాగునీటి పైపులు వేసే సమయంలో రోడ్లు ఛిద్రం చేశారని, దీంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వివిధ శాఖల ప్రణాళికలను సంబంధిత అధికారులు సమావేశంలో వివరించారు. అంతకుముందు ఎమ్మెల్సీ నర్తు రామారావును ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ చింతు అన్నపూర్ణ, తహసీల్దార్ కనకారావు, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

ఉచిత ఇసుకతో నిర్మాణరంగం పరుగులు

కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు నాయుడు అమలు చేసిన ఉచిత ఇసుక విధానంతో నిర్మాణ రంగం పరుగులు తీస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. కేవలం ఇసుక లోడింగ్, ఇసుక ర్యాంపుల్లో రోడ్డు వేసేందుకు అయ్యే ఖర్చు మాత్రమే తీసుకుని ఇంటి నిర్మాణాలకు ఇసుక అందించడం జరుగుతుందన్నారు. గుర్తించిన ఇసుక ర్యాంపుల్లో తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి ఇస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శిమ్మ చంద్రశేఖర్, గొద్దు చిట్టిబాబు, కింజరాపు రామారావు, జల్లు చంద్రమౌళి, బైరి భాస్కరరావు, బలగ ప్రహర్ష తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల భవనానికి స్థలం కేటాయించండి

జలుమూరు: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనానికి స్థలం, నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఆశాఖ గౌరవాధ్యక్షుడు నిక్కు హరిసత్యనారాయణ కోరారు. కత్తిరివానిపేట క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని మంగళవారం కలిసి అభినందించారు. అనంతరం సంఘ సమస్యలపై వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బుడితి సంఘం ప్రతినిధులు ఎ.చంద్రశేఖరరావు, శశిభూషణపాడి, వాన కనకయ్య, పి.శివాజీ, పి.కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ద్వారా విద్యార్థుల్లో జాతీయభావం

టెక్కలి: విద్యార్థి దశ నుంచి జాతీయభావం పెంపొందించేందుకు ఏబీవీపీ కృషి చేస్తోందని బీజేపీ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు బూరె నరేంద్ర చక్రవర్తి అన్నారు. ఏబీవీపీ 76వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం టెక్కలిలో ర్యాలీ చేపట్టారు. వివేకానంద స్వామి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ అలుపెరగని పోరాటం చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతి నిధులు సుబ్బరాజు, శ్యామ్, మదన్‌మోహన్, విశ్వ, నాగ, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

పోలాకి రోడ్డులో రెండు గంటల పాటు ట్రాఫిక్ జాం

నరసన్నపేట: పోలాకి రోడ్డులో దేశవానిపేట సమీపంలో మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సుమారు 2 గంటల పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఇదే ప్రదేశంలో ఉన్న ఓ కల్యాణమండపంలో ఓ రజస్వల వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన వారు ద్విచక్ర వాహనాలు, కార్లు రోడ్డు పక్కన పార్కింగ్ చేయడంతో ఇతర వాహనాలు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. గుప్పిడిపేట నుంచి నరసన్నపేట వచ్చే ఆర్టీసీ బస్సుతో పాటు మరో బస్సు కూడా ట్రాఫిక్‌లో చిక్కిపోయింది. నరసన్నపేట పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఉచితంగా ఇసుక అందించడం హర్షణీయం

వజ్రపుకొత్తూరు: ఉచితంగా ఇసుకు అందించి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించడంతో పాటు ఇళ్ల నిర్మాణాలకు వెసులుబాటు కల్పించిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడుకే దక్కిందని టీడీపీ నాయకులు అన్నారు. ఈ మేరకు మంగళవారం నువ్వలరేవు గ్రామంలో చంద్రబాబు చిత్ర పటానికి భవన నిర్మాణ కార్మికులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కదంబాల వెంకటరమణ, కార్మిక నాయకులు బైనపల్లి లోకనాథం, ఎ.మోహనరావు, ఆనంద మేస్త్రీ, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్మికులు,నేతలు

యూనిఫారాల పంపిణీలో అలసత్వం వద్దు



యూనిఫారాల బండిళ్లను పరిశీలిస్తున్న డీఈవో

పలాసరూరల్: విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న యూనిఫారాల పంపిణీలో అలసత్వం వహించవద్దని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. మండల రీసోర్స్ కేంద్రంలో ఉన్న యూనిఫారాల బండిళ్లను మంగళవారం పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని పాఠశాలలకు యూని ఫారాలు పంపిణీ చేశారు, ఇంకెన్ని పాఠశాలలకు ఇవ్వాల్సి ఉందని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. రికార్డుల్లో ఉన్న దుస్తులకు, గొడౌన్ ఉన్న వాటికి సరిపోయినదీ లేనిదీ పరిశీలించారు. ఎంఈవోలు సీహెచ్ సత్యం, శ్రీనివాసరావు, పి.బాలరాజు, శివ తదితరలున్నారు.

ఉద్యోగ మేళాలో పలువురు ఎంపిక

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జేకేసీ, కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో ఎంఎస్ఎన్ ల్యాబరేటరీస్, హైదరాబాద్ ప్రతినిధులు మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ మాట్లాడుతూ.. ఉద్యోగ మేళాలో అర్హతను బట్టి 11 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు.

రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువుల విక్రయాలు

టెక్కలి: పెద్దసాన, భగవాన్‌పురం గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో మంగళవారం రైతులకు డీఏపీ, యూరియా ఎరువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు మెండ దమయంతి, కార్యదర్శి అల్లు తులసి మాట్లాడుతూ.. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రైతు పక్షపాతి అని, అందుకే ఎరువుల కొరత రాకుండా ఉండేందుకే ముందుగా రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పొన్నాడ దమయంతి, నూక కనకారావు, గూన మీనాకుమార్, కోట శివయ్య, బొడ్డేపల్లి లచ్చు, తురక నీలాచలం, వాకాడ రామారావు తదితరులు పాల్గొన్నారు.

డిప్లొమో విద్యార్థికి రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం

టెక్కలి: కళాశాలకు చెందిన డిప్లొమో ఫైనలియర్ విద్యార్థి బొడ్డేపు శ్యామ్‌సుందర్ రాష్ట్రస్థాయి పరీక్షల్లో ప్రథమ స్థానం పొందాడని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు తెలిపారు. స్టేట్‌బోర్డు టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ విడుదల చేసిన ఫలితాల్లో శ్యామ్‌సుందర్ మూడేళ్లలో 97.26 శాతం మార్కులు సాధించాడన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ శ్రీనివాస రావు, డిప్యూటీ డైరెక్టర్ డి.శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.



శ్యామ్‌ను అభినందిస్తున్న డైరెక్టర్

తిడ్డిమికి చెందిన కిక్ బాక్సర్ మాధవి మృతి

పాతపట్నం: తిడ్డిమి గ్రామానికి చెందిన బూరగాన మాధవి (23) హైదరాబాద్‌లో అనారోగ్యంతో సోమవారం మృతి చెందినట్లు ఎంపీటీసీ తూలుగు ప్రవీణ్ మంగళవారం తెలిపారు. మాధవి వియత్నాం దేశంలో జరిగిన సావనీర్-2018 అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీ ల్లో ఇండియా తరపున పాల్గొని కాంస్య పతకం సాధించింది. హైదరాబాద్ ముసాపేటలో జీవనోపాధికై వలసవెళ్లి తల్లిదండ్రులతో నివాసం ఉంటోంది. గ్రామీణ నేపథ్యం కలిగిన మాధవి కిక్ బాక్సింగ్‌తో పాటు పలు క్రీడల్లోనూ రాణించిందని గ్రామస్థులు తెలిపారు. మాధవి ఆకస్మిక మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకు న్నాయి.



మాధవి(ఫైల్)

ఇసుక తవ్వకాల ప్రదేశంలో కందకాలు

హిరమండలం: వంశధార నదిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ప్రాంతంలో తహసీల్దార్ సుధాకర్ దగ్గరుండి కందకం తవ్వించారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'తవ్వేసి తరలించేసి' శీర్షికతో వచ్చిన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతున్న ప్రాంతాలను గుర్తించారు. ఈ ప్రాంతాల్లో ఎక్స్‌కవేటర్‌తో కందకాలు తవ్వించారు. ఆర్ఐ ఈశ్వరరావు, వీఆర్వోలు రూపావతి, ఇందుశేఖర్ పాల్గొన్నారు.



ఇసుక అక్రమ తవ్వకాల ప్రదేశంలో కందకాలు తవ్విస్తున్న అధికారులు

ప్రభుత్వ స్థలం ఆక్రమిస్తే చర్యలు

ఇందిరానగర్ (పోలాకి): పోలాకి ఇందిరా నగర్, రెవెన్యూ వెలుగు కార్యాల యాల మధ్య ప్రభు త్వ స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు తప్పవని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం రావడం, స్థానిక యువకులు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ ప్రసాదరావు స్పందించారు. సదరు ప్రదేశంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశామన్నారు.



ఆక్రమించిన స్థలం వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

మొక్కలు కనిపించడం లేదు

హిరమండలం: గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు కనిపించడం లేదని తనిఖీ బృందాలు సామాజిక ప్రజావేదికలో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. మస్టర్ల దిద్దుబాట్లను గుర్తించారు. ఉపాధి నిధుల చెల్లింపులు, పనుల కొలతలు, వేతనదారుల వివరాల రికార్డులు సక్రమంగా నిర్వహించాలని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ రాధ, ఎంపీడీవో స్వరూపరాణి, ఏపీవో శ్రీనివాసరావు, జడ్పీటీసీ పి.బుచ్చిబాబు పాల్గొన్నారు.

నా భార్యతో ప్రాణహాని

● పోలీసులను ఆశ్రయించిన భర్త

శ్రీకాకుళంక్రైమ్: తన భార్య నుంచి ప్రాణ హాని ఉందని, రక్షణ కల్పించాలంటూ ఓ భర్త పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గార మండలం పేర్లవానిపేట గ్రామానికి చెందిన పేర్ల చైతన్యకు తన అక్క కుమార్తెతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వృత్తిరీత్యా సీమెన్ కావడంతో చైతన్య ఎక్కువగా సముద్రంలో ఉంటుంటాడు. అయితే గత రెండేళ్లుగా అతని భార్య అదే గ్రామానికి చెందిన వ్యక్తితో సన్నిహితంగా ఉండటం, భర్త జీతం డబ్బులను విలాసాలకు వినియోగిస్తున్నట్లు గ్రామస్థుల ద్వారా చైతన్య కుటుంబ సభ్యులు తెలుసుకున్నారు. దీనిపై ఆమెను నిలదీశారు. అయినా పరిస్థితిలో మార్పురాకపోవడంతో చైతన్య కుటుంబ సభ్యులు గార పోలీసులను ఆశ్రయించారు. భర్త ఫిర్యాదు చేయాలని చెప్పడంతో ఉద్యోగం నుంచి వచ్చి చైతన్య మంగళవారం ఫిర్యాదు చేశాడు. ఇది తెలుసుకున్న భార్య.. భర్తతో పాటు అతని కుటుంబ సభ్యులపై శ్రీకాకుళం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే తాను చెప్పింది చేయకపోతే చంపుతానని తన భార్య బెదిరిస్తుందని, న్యాయం చేయాలని పోలీసులకు చైతన్య మొరపెట్టుకున్నాడు. దీంతో గార, వన్‌టౌన్‌లో అందిన ఫిర్యాదులపై పోలీసులు విచారణ చేపడుతున్నారు.

ఏపీఎంపై ఫిర్యాదు

ఇచ్ఛాపురం: కేసుపురం పంచాయతీ సీఎఫ్ నియామకంలో ఏపీఎం సనపల ప్రసాద్ అవకతవకలకు పాల్పడ్డారని అదే గ్రామానికి చెందిన అయ్యప్ప స్వయంశక్తి సంఘం ఆర్గనైజర్ గౌతమి ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. సమగ్ర దర్యాప్తు జరిపి న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై ఏపీఎం ప్రసాద్ వద్ద ప్రస్తావించగా.. 'సీఎఫ్ కోసం సూరి కల్పన, పిలక గౌతమి పోటీ పడ్డారు. పంచాయతీలో 50 స్వయం శక్తి సంఘాలు ఉండగా 45 సంఘాలు కల్పనకు, ఐదు సంఘాలు గౌతమికి మద్దతు తెలిపాయి. దీంతో సీఎఫ్‌గా కల్పనను నియమించాం. ఎటువంటి లవకతవకలు జరగలేదు.' అని తెలిపారు.

సచివాలయ తాళాలు స్వాధీనం

జి.సిగడాం: మండలంలోని పెంట గ్రామ సచివాలయ తాళాలను వైసీపీ నాయకుడి నుంచి ఎంపీడీవో వెంకన్నబాబు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం వచ్చిన వైసీపీ నాయకుడి వద్ద సచివాలయ తాళాలు కథనంపై ఎంపీడీవో స్పందించారు. ఈ మేరకు విచారణ చేపట్టారు. సచివాలయంలో అనధికారికంగా వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు నిర్వహించటం, తాళాలు వైసీపీ నాయకుడి వద్ద ఉంచటం సరికాదన్నారు. తాళాలు తీసుకొని సచివాలయ సిబ్బందికి అప్పగించారు. ఇక నుంచి ఇటువంటి అనధికార కార్యక్రమాలు నిర్వహించినవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విచారణలో సర్పంచ్ సోనియా, ఈవోఆర్డీ ఎస్.శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి పొట్నూరు సురేష్‌కుమార్, సచివాలయ సిబ్బంది, మక్క శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఐదు ఇసుక లారీల పట్టివేత

ఎచ్చెర్ల: శ్రీకాకుళం రూరల్, నరసన్నపేట మండలాల నుంచి విశాఖపట్నానికి అక్రమంగా తరలిస్తున్న ఐదు ఇసుక లారీలను మంగళవారం చిలకపాలెం జంక్షన్ వద్ద పట్టుకున్నట్టు ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు. ఈ లారీలను సీజ్ చేసి బాధ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

అపరిశుభ్రంగా పాఠశాల పరిసరాలు

● ఉపాధ్యాయులపై కలెక్టర్ ఆగ్రహం

సరుబుజ్జిలి: రొట్టవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పాఠశాలను మంగళవారం కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, ఇతర వ్యర్థాలను చూసి కలెక్టర్ ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే వీటిని తొలగించి పరిసరాల పరిశుభ్రత, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఇన్‌చార్జి హెచ్ఎం ఎంవీ రమణ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎచ్చెర్ల ఎమ్మెల్యే

కలెక్టరేట్: ఎచ్చెర్ల శాసనసభ్యుడు నడుకుదిటి ఈశ్వరరావు మంగళవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన నియోజకవర్గంలోని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

1500 లీటర్ల బెల్లంఊట ధ్వంసం

హరిపురం: మందస మండలం పిడిమందస పంచాయతీ కరియాపల్లి గ్రామంలో సెబ్ సీఐ జైభీం ఆధ్వర్యంలో మంగళవారం సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1500 లీటర్ల బెల్లం ఊటలు, 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ ఎస్.చంద్రమోహన్, సిబ్బంది యోగీశ్వరరావు, భాను, నాయుడు, కాంతారావు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

రణస్థలం: మండల కేంద్రంలోని మన గ్రోమార్ ఎరువుల దుకాణాన్ని వ్యవసాయ సహాయ సంచాలకుడు పి.మురళీకృష్ణ, విజిలెన్స్ డీఎస్పీ ఎస్.కిరణ్‌కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు సంబంధించిన రికార్డులు, బిల్లులు పరిశీలించారు. నిల్వలను కూడా పరిశీలించారు. రూ.4,59,389 విలువ చేసే ఎరువులకు సంబంధించిన బిల్లులు లేనట్లు గుర్తించారు. ఈ బిల్లులు సమర్పించేవరకూ విక్రయాలు చేపట్టరాదని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయ నాణ్యత నియంత్రణ అధికారి మురళీధర్, ఏడీఏ వి.శ్రీనివాసరావు, ఏవో డి.విజయభాస్కరరావు పాల్గొన్నారు.

ఎన్ఏసీఎల్ పరిశ్రమ పరిశీలన

ఎచ్చెర్ల: ఎన్ఏసీఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (అరిణాం అక్కివలస)ను వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు మంగళవారం పరిశీలించారు. వ్యవసాయ పురుగుల మందు తయారీ కేంద్రమైన ఈ పరిశ్రమలో నాణ్యత, భద్రతా ప్రమాణాలు ఏ మేరకు పాటిస్తున్నారో తనిఖీ చేశారు. పరిశ్రమలోని వివిధ బ్లాక్‌లను సందర్శించారు. వ్యవసాయ సహాయ సంచాలకుడు (తాడేపల్లి గూడేం) పి.మురళీకృష్ణ, విజిలెన్స్ డీఎస్పీ ఎస్.కిరణ్‌కుమార్, నాణ్యత నియంత్రణ అధికారి మురళీధర్, మండల వ్యవసాయాధికారి వై.సురేష్ పాల్గొన్నారు.


పరిశ్రమను పరిశీలిస్తున్న వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు

అక్రమ నిర్మాణం కూల్చివేత

పలాస: పట్టణ పరిధిలోని శివాజీనగర్‌లో అక్రమంగా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాన్ని రెవెన్యూ అధికారులు మంగళవారం కూల్చివేశారు. శివాలయం రోడ్డులో ఉన్న ఈ స్థలం ప్రభుత్వానికి చెందిన దని, శివాలయం అభివృద్ధికి ఇవ్వాలని స్థానికులు ఇటీవల రెవెన్యూ, మున్సిపల్ కమిషనర్, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు వినతిపత్రం ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఇంటి నిర్మాణం చేయవద్దని పలు మార్లు అధికారులు హెచ్చరించినా నిర్మాణం చేపట్టడంతో ఇంటి ముందు భాగాన్ని అధికారులు కూల్చివేశారు. బాధితురాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సీతారామ్‌నగర్ కాలనీకి చెందిన ఎం.నాగమ్మ తనకు 2009లో రెండు సెంట్ల స్థలాన్ని ప్రభుత్వం ఇచ్చినట్లు చెబుతోంది. ఖాళీస్థలానికి పన్ను కూడా చెల్లించామని, తాను లేని సమయంలో రెవెన్యూ అధికారులు భవనాన్ని కూల్చివేతకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ సందర్భంగా ఆర్ఐ నిరంజన్, రెవెన్యూ అధికారులతో బాధిత కుటుంబం వాగ్వాదానికి దిగింది. ఇక్కడ గతంలో వైసీపీ నాయకులు ప్రభుత్వ భూములు ఆక్రమించుకొని నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఇప్పటికే కలెక్టర్ వద్ద ఫిర్యాదు ఉంది. ఈ నేపథ్యంలో కూల్చివేతకు పాల్పడడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారంపై తహసీల్దార్ ఎస్ఎస్‌వీఎస్ నాయుడును వివరణ కోరగా.. అవి నకిలీ పట్టాలని, తమ రికార్డుల్లో ఎటువంటి ఆధారాలు లేవన్నారు. అక్రమ నిర్మాణం చేస్తున్నారన్న ఫిర్యాదుపై పరిశీలించామని, పలు మార్లు నిర్మాణం చేపట్టవద్దని హెచ్చరించినా వినిపించుకోలేదని, ఈ మేరకు చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు.


రెవెన్యూ అధికారులతో వాగ్వాదం చేస్తున్న బాధిత మహిళ

వంతెన నిర్మాణం పూర్తయ్యేనా?

● ఐదేళ్లుగా నిలిచిన గార-వనిత మండలం వంతెన పనులు
● కొత్త ప్రభుత్వంపైనే ఆశలు

గార: వందలాది గ్రామాలకు ఎంతో ఉపయోగమైన గార-వనిత మండలం వంతెన పనులు ఐదేళ్లుగా నిలిచిపోయాయి. ఈ వంతెనను వైసీపీ సర్కారు తీవ్ర నిర్లక్ష్యం చేసింది. పనుల విషయాన్ని పూర్తిగా మరిచింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నూతన ప్రభుత్వమైనా వంతెన పనులు పూర్తి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పోలాకి మండలంలోని వనితమండలం గ్రామం వద్ద వంశధార నదిపై వంతెన నిర్మాణానికి 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన జరిగింది. రూ.72 కోట్లు కేటాయించి పనులు ప్రారంభించారు. నదిలో 17 సిమెంట్ స్తంభాలు, నదికి ఇరువైపులా రెండు ఎబెట్‌మెంట్‌లు నిర్మించారు. కొద్దిగా స్లాబ్ పనులు కూడా చేశారు. ఏడాదిలో సుమారు 75 శాతం వరకు పనులు పూర్తయ్యాయి. అయితే, 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మిగిలిన పనులను పూర్తి చేయడంలో విఫలమైంది. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో పనులను ఆపేశాడు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వంతెన పూర్తయితే సముద్ర తీర మండలాలు సంతబొమ్మాళి, పోలాకి, గార, శ్రీకాకుళం, ఎచ్చెర్ల మొదలైన ప్రాంతాలకు చెందిన వందలాది గ్రామాల వారికి ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ఈ ప్రాంతాల వారు జాతీయ రహదారి పైకి వెళ్లకుండా ఈ వంతెన మీదుగా ఇటు శ్రీకాకుళం, శ్రీకూర్మం, కళింగపట్నం, శాలిహుండాంతో పాటు అటువైపు నరసన్నపేట, శ్రీముఖలింగం, టెక్కలి, రాయవలస మొదలైన ప్రాంతాలకు వెళ్లేందుకు దగ్గరగా ఉంటుంది. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం వంతెన నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు రావాలని ప్రజలు కోరుతున్నారు.

వంతెనను అందుబాటులోకి తీసుకురావాలి



వంతెన పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలి. గత ప్రభుత్వం వంతెన నిర్మాణం చేపట్టకుండా నిర్లక్ష్యం చేసింది. దీనివల్ల వందలాది గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనుల పూర్తిపై నూతన ప్రభుత్వం దృష్టిసారించాలి.

-తాళ్లూరి శివనరసింహప్రసాద్, టీడీపీ నాయకుడు, కళింగపట్నం


నిలిచిన వంతెన పనులు

చేసింది తక్కువ.. చెప్పింది ఎక్కువ

● ప్రభుత్వ భవనాలు ఎందుకు పూర్తి కాలేదు?
● పంచాయతీరాజ్ సమీక్షలో ఎమ్మెల్యే అశోక్

కవిటి, జూలై 9: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదని, కానీ గొప్పలు మాత్రం ఎక్కువగా చెప్పిందని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. రామయ్యపుట్టుగలో మంగళవారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి పంచాయతీరాజ్ సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ భవనాలు పూర్తి కాకపోవడానికి కారణాలు ఏమిటని అధికారులను ప్రశ్నించారు. నియోజకవర్గంలో 86 గ్రామ సచివాలయాలకు 41, రైతుభరోసా కేంద్రాలు 86కు 36, ఆరోగ్య కేంద్రాలు68కి 17, బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్లు 56కు 3 భవనాలు పూర్తి చేసినట్లు అధికారులు చెప్పారు. డిజిటల్ లైబ్రరీలు ఒక్కటి కూడా నిర్మాణానికి నోచుకోలేదన్నారు. రూర్బన్ నిధులు దుర్వినియోగం చేసి పనులు జరిపించలేదని ఎమ్మెల్యే అన్నారు. టూరిజం శాఖ ద్వారా మంజూరైన రోడ్లను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో జేఈలు ప్రవీణ్‌కుమార్, రమేష్, బీఆర్ దొళాయి, హిమసాగర్‌లు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

ఉచిత ఇసుకతో నిర్మాణరంగం ప్రగతిబాట

● ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, జూలై 9: ప్రభుత్వం తీసుకువచ్చిన ఉచిత ఇసుక పాలసీతో నిర్మాణరంగం ప్రగతిబాట పట్టనుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఉచిత ఇసుక పాలసీకి స్వాగతం పలుకుతూ మంగళవారం ఏడు రోడ్ల జంక్షన్ నుంచి పాత బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి ఉచిత ఇసుక విధానం తీసుకువచ్చినట్లు తెలిపారు. గత ఐదళ్లలో నిర్మాణ రంగం నాశనం కావడంతో జిల్లా నుంచి వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు ఇతర రాష్ట్రాలకు వలసలు పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత ఇసుకతో నిర్మాణ రంగం ప్రగతిబాట పట్టి కార్మికులకు స్థానికంగానే ఉపాధి లభించనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇది పేదల ప్రభుత్వం

ఉచిత ఇసుక విధానాన్ని తీసుకువచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ముస్లిం మైనార్టీ సెల్ నాయకులు మంగళవారం ధన్యవాదాలు తెలిపారు. సెల్ అధ్యక్షుడు షేక్ ముబారక్ మాట్లాడుతూ.. పేదల, సామాన్యుల సొంత ఇంటి కల నెరవేర్చే విధంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఇది పేదల ప్రభుత్వం అనడానికి ఒక నిదర్శన మని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు షాను, నాయకులు సయ్యద్ షఫీ, సయ్యద్ రోషన్ బాషా, షఫ్రక్ అహ్మద్, రహమతుల్లా ఖాన్, మొహమ్మద్ బాషా ఖాన్, రావు ఖాన్, రషీద్,సలీం, షరియత్ హబీబ్, మెహతాబ్ ఖాన్ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు

రాజధాని నిర్మాణానికి విరాళం

మెళియాపుట్టి: రాజధాని అమరావతి నిర్మాణానికి టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు అనపాన రాజశేఖరరెడ్డి రూ.21 వేలను మంగళవారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు హనుమంతు చంద్రశేఖర్, బమ్మిడి భాస్కరరావు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమమే ముఖ్యం

సరుబుజ్జిలి: విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా పని చేయాలని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల సిబ్బందిని సీజనల్ వ్యాధుల ప్రత్యేకాధికారిణి, జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి వీఎస్ఎస్ఎల్ ప్రసన్న ఆదేశించారు. ఈ నెల 6న వెన్నెలవలస ఆశ్రమ పాఠశాల విద్యార్థిని బిడ్డి రిస్మిత మలేరియా జ్వరంతో మరణించింది. దీంతో మంగళవారం ఈ పాఠశాలను ప్రసన్న తనిఖీ చేశారు. మలేరియా పాజిటివ్ కేసులపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బాలికల వసతిగృహం, మరుగుదొడ్లు, భోజనం నాణ్యత తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి పిల్లలకు రక్తపరీక్షలు తరచూ చేయాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో తప్పకుండా విద్యార్థినుల వద్ద రెగ్యులర్ సిబ్బంది ఉండి పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైబుల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, ఏటీడబ్ల్యూవో కృష్ణవేణి, మలేరియా అడిషనల్ డైరెక్టర్ ప్రసాదరావు, జోనల్ మలేరియా అధికారి శాంతి ప్రభ, పాఠశాల హెచ్ఎం బిడ్డిక ఉమ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రాణ రక్షణకు హెల్మెట్ దోహదం

సోంపేట: ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని, సీనియర్ సివిల్ న్యాయాధికారి జే.శ్రీనివాసరావు అన్నారు. సంస్కారభారతి డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రమాదాల సమయంలో ప్రాణ రక్షణకు హెల్మెట్ ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఈ సదస్సులో ఎంవీఐ ఆర్.అనీల్, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు మద్దు సర్వేశ్వరరావు, కళాశాల యాజమాన్యం ప్రిన్సిపాల్ బి.శ్రీరాంమూర్తి, కవిబాబు, ఏవో పాపారావు పాల్గొన్నారు.

13, 14 తేదీల్లో బ్యాడ్మింటన్ పోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్: నగరంలోని ఇండోర్ స్టేడియంలో ఈ నెల 13, 14 తేదీల్లో జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్ తెలిపారు. పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. పోటీల్లో పాల్గొనే వారు ఈ నెల 11లోగా పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు బైరి దామోదర్, అశోక్‌కుమార్, రత్నాజీ, జి.ప్రసాద్, సీఈవో సంపతిరావు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పీఈఎఫ్ఐ సభ్యునిగా భాస్కర్

ఎచ్చెర్ల: కేంద్ర యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖ గుర్తింపు పొందిన ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా (పీఈఎఫ్ఐ) సభ్యునిగా బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ పీఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ అంకెం భాస్కర్ ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం వర్సిటీకి ఉత్తర్వులు అందాయి. రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న భాస్కర్ మూడేళ్ల పాటు ఈ బాధ్యతల్లో కొనసాగుతారు. జాతీయ స్థాయిలో క్రీడల ప్రోత్సాహం, అభివృద్ధికి ఈ అసోసియేషన్ దోహదపడనుంది.

డ్రైడేతో వ్యాధుల నిర్మూలన

కలెక్టరేట్: ప్రతీ శుక్రవారం, మంగళవారం డ్రై డేను పాటించడం ద్వారా వ్యాధుల నిర్మూలన సాధ్యపడుతుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. కలెక్టర్, ఇండియన్ రెడ్‌క్రాస్ అధ్యక్షుని ఆదేశాల మేరకు రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు, నైపుణ్యాభివృద్ధి కేంద్రం పరిసరాలను మంగళవారం శుభ్రపరిచారు. నీటి నిల్వలు తొలగించి బ్లీచింగ్ చల్లారు. పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహన్రావు, కార్యదర్శి బలివాడ.మల్లేశ్వరరావు, కోశాధికారి దుర్గా శ్రీనివాస్, ఏట నర్సింగరావు, మేనేజర్ గుణాకరరావు, సతీష్‌కుమార్, చిన్మయరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

117 జీవో రద్దు ఏపీటీఎఫ్ ఎజెండా

● రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భానుమూర్తి

పొందూరు: ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం చేస్తున్న 117 జీవోను రద్దు చేయించడమే ఏపీటీఎఫ్ ప్రధాన ఎజెండా అని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి అన్నారు. పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఏపీటీఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 117 జీవో రద్దు చేయాలని ఇప్పటికే విద్యాశాఖామంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల బకాయిలను చెల్లించాలని కోరినట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎం.రమణరావు, ప్రతినిధులు డి.శ్రీనివాసరావు, దండా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

కాలువపై పలకలు సరి చేశారు

పొందూరు: నిత్యం ప్రమాదాలకు కారణమవుతున్న మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రధాన కాలువ సమస్య స్థానిక టీడీపీ నాయకుల చొరవతో పరిష్కారమైంది. ప్రధానకాలువపై ఉన్న కాంక్రీట్ పలకలు విరిగిపోవడంతో ద్విచక్ర వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. కాంప్లెక్స్‌కు వచ్చే ఆర్టీసీ బస్సులు కాలువలో పలుమార్లు ఇరుక్కుపోయేవి. కాలువలో పూడిక నిండిపోవడంతో మురికినీరు బయటకు వచ్చి దుర్గంధం వెదజల్లేది. ఈ సమస్య టీడీపీ నాయకుల దృష్టికి రావడంతో మంగళవారం ఎక్స్‌కవేటర్‌తో పూడికను తొలగించి కాంక్రీట్ పలకలను సరిచేశారు. ఈ పనులను టీడీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్, పట్టణ అధ్యక్షుడు ఎ.చినరంగ, కె.శ్రీనివాసరావు పంచాయతీ అధికారులు పర్యవేక్షించారు.


పనులను పరిశీలిస్తున్న నాయకులు

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే ఎంజీఆర్

కొత్తూరు: నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. కౌసల్యాపురంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్థులు సాదర స్వాగతం పలికి అభినందించారు. గ్రామ సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. అనంతరం స్కూల్ విద్యార్థులకు యూనిఫారాలు అందించారు. టిడిపి మాజీ మండల ఉపాధ్యక్షుడు మాతల గాంధీ రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.10,001 ఎమ్మెల్యేకి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కలశాలతో ఊరేగింపు


కలశాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న మహిళలు

కవిటి: కవిటి పంచాయతీ పెద్దఎర్రగోవిందపుట్టుగలో చింతామణి, కాళీమాత ఆలయ ప్రతిష్ఠకు మహిళలు కలశాలతో ఊరేగింపును మంగళవారం సాయంత్రం నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ మహిళలు కలశాలతో జలాలు తీసుకువచ్చి పూజలు చేశారు. ప్రత్యేక చండీయాగం, హరేరామ..హరేకృష్ణ నామ యజ్ఞం నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

కళాకారులపై దాడి

శ్రీకాకుళంక్రైం: శ్రీకాకుళం జీటీ రోడ్‌లో స్టేట్‌బ్యాంకు వద్ద తప్పెటగుళ్ల కళాకారులపై, కాళీ వేషధారులపై ఆరుగురు యువకులు మంగళవారం రాత్రి 10 గంటలకు దాడి చేశారు. గుడి వీధిలో జరుగుతున్న అమ్మవారి ఉత్సవాల్లో ప్రదర్శనలు ఇచ్చేందుకు తప్పెటగుళ్ల కళాకారులు, కాళీ వేషధారులు వచ్చారు. అయితే, ఏం జరిగిందో గానీ వీరిపై యువకులు దాడికి పాల్పడడంతో వారి నుంచి తప్పించుకుని రోడ్లపై పరుగులు పెట్టారు. అలాగే, టౌన్ హాల్ సందులో ఉన్న కె.ధర్మారావు అనే టైలరింగ్ షాపులోకి యువకులు చొరబడి అతడిని కొట్టి కత్తెరను తీసుకొని వెళ్లారు. పెద్దపాడుకు చెందిన ఎడ్ల గణేష్‌తో పాటు మరికొందరికి గాయాలయ్యాయి. దాడి చేసిన వారిలో మాజీ వలంటీర్‌తో సహా ఆరుగురు వ్యక్తులు ఉన్నారని స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ ఎస్ఐ కామేశ్వరరావు, ఏఎస్ఐ రాంబాబు, తన సిబ్బందితో వెళ్లి గుడి వీధిలోని రివర్ వ్యూ పార్క్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. నిందితుల పేర్లు తెలియాల్సి ఉంది.


వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

జాబ్‌మేళా రేపు

గుజరాతీపేట: అరసవల్లి దరి శ్యామ్‌పాలెంలోని శారదా డిగ్రీ కళాశాలలో గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నారు. వివిధ కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు జరగనున్నాయి. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులై 35 ఏళ్లలోపు వారు హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

'మా గ్రామ సమస్యలు పరిష్కరించండి'

కంచిలి: తమ గ్రామ సమస్యలు పరిష్కరించాలని బూరగాం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుని కోరారు. ఈ మేరకు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామానికి ఆనుకొని ఉన్న హైవే వద్ద అండర్ పాస్ సమస్య పరిష్కరించాలని, జాతీయ రహదారి నుంచి రైల్వే గేట్ వరకు సీసీ రోడ్డు నిర్మించాలని, 8వేల లీటర్ల ఓవర్ హెడ్ ట్యాంక్ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి బిడ్డు అప్పారావు, బి.నాగేష్, బి.డిల్లీరావు, ఆర్.బాలరాజు, బి.కోదండరావు, కె.మోహన్‌రావు, టి.వాసు పాల్గొన్నారు.

వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

సోంపేట: మేజర్ పంచాయతీలో గత మూడేళ్లుగా అనధికార వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం పంచాయతీ కార్యాలయంలో డీఎల్‌పీవో ఐవీ రమణకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిత్రాడ శ్రీనివాసరావు, చిత్రాడ శేఖర్, దూసి మధుసూదన్, బీన ఆనంద్, తెల్లి ధర్మారావు, సానా షణ్ముఖరావు పాల్గొన్నారు.

గ్యాస్ పొయ్యిల పంపిణీ

కంచిలి: మండలంలోని పెద్దశ్రీరాంపురంలో ఉచిత గ్యాస్ పొయ్యిలను స్థానిక ఎంపీటీసీ మాదిన విమల, టీడీపీ నాయకుడు మాదిన రామారావు మంగళవారం పంపిణీ చేశారు. ప్రధానమంత్రి ఉజ్వల పథకం ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు గ్యాస్‌పొయ్యిలు, సిలిండర్లు అందజేశారు. కార్యక్రమంలో ఈశ్వరరావు, శంకర్, చిరంజీవి, ప్రసాద్, శ్రీధర్, లజపతి, కామేష్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

బాలసంజీవిని..

ఇచ్ఛాపురం: భవానిపురం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణిలు, బాలింతలకు మంగళవారం బాలసంజీవిని పంపిణీ చేశారు. అంగ్‌వాడీ కార్యకర్త నరసమ్మ పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రథమ చికిత్స కిట్లు..

సురంగి రాజా, జ్ఞానభారతి, కేజీబీవీ మైదానాల్లో మంగళవారం క్రీడాకారులకు స్థానిక జేసీఐ క్లబ్ సభ్యులు ప్రథమ చికిత్స కిట్లను అందజేశారు. ఈకార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు షణ్ముఖరావు, కార్యదర్శి పవన్‌కుమార్, సభ్యుడు డిల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నూతన అధ్యక్షుడిగా ఢిల్లీరావు

సోంపేట: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ సోంపేట మండలశాఖ నూతన అధ్యక్షుడిగా ఎ.ఢిల్లీరావు ఎన్నికయ్యారు. బాలికోన్నత పాఠశాలలో బి.చక్రధర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఢిల్లీరావును ఏకగ్రీవగంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి ఎస్.చాణిక్య, రాష్ట్రకౌన్సిలర్ జి.రాజేష్, జి.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కచేరి

ఇచ్ఛాపురం: జగన్నాథ రథయాత్రలో భాగంగా వేంకటేశ్వర భక్తి రంజని చిన్నగురుస్వామి బృందంతో సోమవారం రాత్రి నిర్వహించిన సంగీత కచేరి కార్యక్రమం అలరించింది. గానం వెంకటేశ్వర పట్నాయిక్, కీ బోర్డు హేమంత్‌కుమార్, తబాలా నిత్యానంద బాడిత్య సహకరించారు.

ఒడియా కొనసాగింపుపై హర్షం

కవిటి: జిల్లాలోని సీబీఎస్ఈ పాఠశాలల్లో ఒడియా మాధ్యమంలో చదువుతున్న విద్యార్థులకు అదే లాంగ్వేజ్‌లో పదో తరగతి పరీక్షలు రాసేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాలు ఇవ్వటంపై ఒడియా టీచర్స్ అసోసియేషన్ (ఆపోటా) ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని న్యాయం చేసినందుకు మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. హర్షం వ్యక్తం చేసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్‌పాడి, ప్రధాన కార్యదర్శి బృందావన్ దొళాయి, ఉత్తరాంధ్ర ఒడియా డీఐ దుర్గాప్రసాద్ ఉన్నారు.

కౌలు రైతులు కార్డులు పొందాలి

గార: కౌలు రైతులు కౌలు కార్డులను పొందాలని వ్యవసాయ అధికారి దుంపల పద్మావతి అన్నారు. బూరవెల్లి, శాలిహుండాం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆమె మాట్లాడారు. మట్టి నమూనా నివేదికలను రైతులకు అందచేశారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీదీప్తి, వీఏఏలు వై.తవిటిరాజు, మనోహర్, వీఆర్వో పాపారావు, రైతులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రైతు సంక్షేమం

ఆమదాలవలస: రైతుల అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని పార్టీ మండల అధ్యక్షుడు, సర్పంచ్ నూకరాజు అన్నారు. మంగళవారం కనుగులవలస పంచాయతీ కార్యాలయం వద్ద రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను రైతులు వినియోగించుకోవాలని కోరారు.

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డల ఆరోగ్యం

ఆమదాలవలస: పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారి కూన మీనాకుమారి అన్నారు. మంగళవారం అక్కులపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్ యోజనలో భాగంగా గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. వైద్యుల సూచనలు, సలహాలను పాటించాలని తెలిపారు. రణస్థలం మండలం పాతర్లపల్లి గ్రామానికి చెందిన నేతల కృష్ణ, రేవతి దంపతుల ఆర్థికసాయంతో 40 మంది గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. కార్య క్రమంలో సత్యసాయి సేవా సంస్థల జోనల్ కన్వీనర్ ఎం.జనార్ధనరావు, జిల్లా జాయింట్ యూత్ కో-ఆర్డినేటర్ సాయికృష్ణ పాల్గొన్నారు.